**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేదీ : 06-10-2018.**

# దసరా ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

ది.10.10.2018 నుండి ది.18.10.2018 వరకు విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టాత్మకంగా జరిగే దసరా ఉత్సవాల వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుండి అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులు మరియు యాత్రికుల భద్రత దృష్ట్యా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రణాళికాబద్ధంగా పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమంలో గత కొద్దిరోజులుగా రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ మరియు నీటిపారుదల శాఖ, శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన అధికారులు మరియు పాలకవర్గ సభ్యులతో ఇప్పటికే పలు మార్లు సమీక్షలు నిర్వహించి గతంలో అవలంభించిన విధానాలు, భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి పరస్పర సమన్వయం మరియు సహకారంతో ప్రతి ఒక్కరికీ స్నేహపూర్వక వాతావరణంలో భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది.

రాజధాని అమరావతిలో భాగంగా ఉన్న విజయవాడ నగరంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు విశిష్ట ప్రాభవం ఉంది. ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ భక్తి భావంతో తమ కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి నగరానికి విచ్చేయడం జరుగుతుంది. నగరానికి విచ్చేసే భక్తులు, యాత్రికులు త్వరితగతిన అమ్మవారి దర్శనాంతరం తిరిగి వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలనే సంకల్పంతో ఈ సంవత్సరం ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్ధం క్రొత్తగా కొన్ని ఏర్పాటు చేయడంతో పాటు ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్సవాల సందర్భంగా ఉపయోగించడం జరిగింది.

ముఖ్యంగా అమ్మవారి ఆలయం వద్ద, కొండ దిగువన, క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, ప్రసాదం కౌంటర్లు, తలనీలాలు సమర్పించే ప్రదేశం, అర్జున వీధి మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాలు, రైల్వేస్టేషన్, పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ మరియు ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు జేబు దొంగతనాలు, స్నాచింగ్‌లు జరుగకుండా ఉండేందుకు ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది.

దసరా ఉత్సవాల సందర్భంగా ఈ సంవత్సరం మొత్తం 9 రోజుల్లో సుమారుగా 15 లక్షల మంది భక్తులు వస్తారని ఒక అంచనా. సాధారణ రోజుల్లో సుమారు 70 వేల మంది, ది.14.10.2018న (ఆదివారం) మూలా నక్షత్రం రోజున సుమారు 2.70 లక్షల మంది మరియు ది.18.10.2018న తెప్పోత్సవం రోజున 2 లక్ష పైచిలుకు భక్తులు వచ్చే ఆస్కారం ఉంది.

ఈ సంవత్సరం బందోబస్తును 32 సెక్టార్లుగా విభజించి ఇందుకు మొత్తం 5400 మంది పోలీస్ సిబ్బంది మరియు అధికారులను వినియోగించడం జరిగింది.

*(మిగతా 2వ పేజీలో ...)*

**<u>పోలీస్ సమాచార కేంద్రాలు :</u>**

1. పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద
2. ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద
3. భవానీపురం పోలీస్‌స్టేషన్ వద్ద
4. రైల్వేస్టేషన్ వద్ద
5. పండిట్ నెహ్రూబస్‌స్టేషన్ వద్ద
6. పోలీస్ కమీషనర్ కార్యాలయం వద్ద

**<u>ట్రాఫిక్ చర్యలు :</u>**

ఉత్సవాల సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రాక మరియు వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు మరియు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా దేవాలయ సమీపంలో మరియు బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు వివిధ ప్రదేశాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా నగరంలో తిరిగే వాహనాలను మరియు ఇతర ప్రాంతాల నుండి నగరం గుండా ప్రయాణించే వాహనాల మళ్ళింపు, క్రమబద్దీకరణ మరియు పార్కింగ్ విషయాల్లో చర్యలు తీసుకోవడం జరిగింది. ఉత్సవాలు ప్రారంభమైన మొదటి మూడు రోజులు హైదరాబాద్ వైపు వెళ్ళే వాహనాలను ఘాట్ రోడ్డు మీదుగా అనుమతించడం జరుగుతుంది. అనంతరం ట్రాఫిక్ రద్దీని బట్టి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. అలాగే హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలు గొల్లపూడి, సితారా జంక్షన్, కబేళా సెంటర్, చిట్టినగర్, పంజాసెంటర్, వెస్ట్‌బుకింగ్, లోబ్రిడ్జి మరియు పోలీస్ కంట్రోల్ మీదుగా ప్రయాణించాలి.

**<u>మూడు ప్రదేశాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు :</u>**

ఉత్సవాల సందర్భంగా ఈ సంవత్సరం భక్తులకు సౌకర్యార్థం మోడల్ గెస్ట్‌హౌస్ (దుర్గాఘాట్ వద్ద), కమాండ్ & కంట్రోల్ మరియు కొండపై భాగంలో అమ్మవారి ఆలయం వద్ద కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగింది.

**<u>సీసీ, డ్రోన్ కెమేరాల నిఘా నీడలో ఉత్సవాల పర్యవేక్షణ :</u>**

భక్తుల రద్దీని గమనించేందుకు అలాగే అనుమానిత వ్యక్తులు, వస్తువులు గమనించేందుకు మరియు దొంగతనాలను నివారణకు సీసీ కెమేరాలు కొండ పై నుండి దిగువ ప్రాంతం వరకు మరియు ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి, ఆపరేషన్ కమాండ్ & కంట్రోల్ మరియు పోలీస్ కమీషనర్ కార్యాలయానికి అనుసందానం చేయడం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించడం జరుగుతుంది. అలాగే 115 ప్రదేశాల్లో రద్దీని పర్యవేక్షించి తద్వారా చర్యలు తీసుకోవడానికి 3 డ్రోన్‌లను కూడా వినియోగించడం జరుగుతుంది.

*(మిగతా 3వ పేజీలో ...)*

**<u>భవానీ సేవాదళ్ :</u>**

ఉత్సవాల సందర్భంగా విచ్చేసే దివ్యాంగులు మరియు వృద్దులు అసౌకర్యాలకు గురికాకుండా వారికి సేవలు అందించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం 120 మంది పోలీస్ సిబ్బందితో భవానీ సేవాదళ్‌ను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది.

అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు మరియు యాత్రికుల భద్రతకు ప్రాముఖ్యతను ఇస్తూ నిర్ధేశించిన ప్రదేశాల్లో ఇంటర్‌సెప్టర్, ఫాల్కన్ మరియు చేరువ నేర నియంత్రణ వాహనాల ద్వారా ఆయా ప్రదేశాల్లో భక్తుల రద్దీని పర్యవేక్షించడం, నేరస్థులు మరియు అల్లరిమూకలపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

అలాగే ప్రసాదం కౌంటర్లు, అన్నదాన ప్రదేశాలు, కేశ ఖండన శాల మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం జరిగింది. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు అంబులెన్స్ మరియు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో సిద్దంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగింది.

**<u>క్యూలైన్లు – స్నాన ఘట్టాల వద్ద భద్రతా ఏర్పాట్లు :</u>**

కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుండి క్యూలైన్లు ప్రారంభమై ఘాట్‌రోడ్డు మీదుగా అమ్మవారి దర్శనం అంతరం తిరిగి అర్జున వీధి మీదుగా కెనాల్ రోడ్డుకు చేరుకుంటారు. **(భక్తుల రద్దీ తక్కువగా ఉన్న రోజుల్లో రథం సెంటర్ క్రొత్త బ్రిడ్జి వద్ద నుండి అమ్మవారి దర్శనానికి అనుమతించడం జరుగుతుంది)** ముఖ్యంగా తొక్కిసలాటలు జరుగకుండా ఉండేందుకు భక్తుల రాకపోకలకు పటిష్టమైన క్యూలైన్‌లు, బ్యారికేడింగ్‌లను ఏర్పాటు చేసి, భక్తులు త్వరితగతిన కదిలేందుకు పోలీసు సిబ్బంది వారికి కేటాయించిన నిర్ధిష్ట ప్రాంతాల్లో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగింది. రద్దీ అధికంగా ఉండే సమయాల్లో రద్దీని క్రమబద్దీకరించేందుకు కంపార్ట్‌మెంట్‌లుగా ఏర్పాటు చేసి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించేలా చర్యలు తీసుకోవడం జరిగింది.

నదీ స్నాన ఘట్టాల వద్ద ఏ విధమైన తొక్కిసలాటలు జరుగకుండా పటిష్టమైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు భక్తులకు తగు సూచనలు అందించడం అలాగే నదీస్నానం ఆచరించే భక్తులు ప్రమాదాల భారినపడకుండా ఉండేందుకు గజ ఈతగాళ్ళను మరియు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచడం జరిగింది.

*(మిగతా 4వ పేజీలో ...)*

<u>స్మార్ట్ పార్కింగ్ ఏర్పాట్లు :</u>

ముఖ్యంగా కీలక ప్రాధాన్యం ఉన్న ట్రాఫిక్‌ను దృష్టిలోపెట్టుకుని రహదారులపై ట్రాఫిక్ జామ్‌లకు ఆస్కారం లేకుండా ఉండేందుకు స్మార్ట్ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఈ సంవత్సరం దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ యాప్ ద్వారా దసరా ఉత్సవాలకు విచ్చేసే భక్తులు మరియు యాత్రికులు ఎటువంటి ఇబ్బంది పడకుండా నిర్ధేశించిన స్థలంలో వారి వాహనాలను సులువుగా పార్కింగ్ చేసుకోడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని జిపిఎస్ ఆన్ చేసుకుంటే ఆ ప్రాంతంలో ఉన్న పార్కింగ్ ప్రదేశాల వివరాలు, ఎంత దూరంలో పార్కింగ్ ప్రదేశం ఉంది, ఏ మార్గంలో వెళ్ళాల్లో తదితర వివరాలతో పాటు అక్కడ ఎంతమేరకు ఖాళీ స్థలం ఉందో తదితర వివరాలు తెలుస్తాయి. అలాగే వివిధ మార్గాల ద్వారా నగరంలోకి ప్రవేశించే భక్తులు సులబంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ముఖ్యమైన ప్రదేశాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది.

కావున విజయవాడ నగరంలో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న దసరా ఉత్సవ వేడుకల సందర్భంగా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన బందోబస్తు చర్యలను ప్రజలు, భక్తులు, యాత్రికులు మరియు మీడియా మిత్రులు గమనించి పోలీసు శాఖకు తోడ్పాటునందిస్తూ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతం కావడానికి సహకరించగలరని విజ్ఞప్తి చేస్తున్నాము.

నగర ప్రజలకు, భక్తులకు మరియు యాత్రికులకు ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే డయల్-100కు గానీ, విజయవాడ సిటీ వాట్సప్ నెం. 73289090900కు గానీ సమాచారం అందించి పోలీసు వారి సహకారం, సహాయం పొందగలరని కోరుతున్నాము.

--- xx ---